# అశ్వచరిత

-టి. రాఘవేంద్రరావు

అనంతాచార్యులు సెకండ్‌హ్యాండ్ కారు కొన్నాడు. జట్కా బండి అమ్మేయాలని నిశ్చయించుకున్నాడు.

బండి పోతేపోయింది. గుర్రాన్ని ఒదలటం కష్టమయింది. కానీ తప్పదు. పాతకాలపు వ్యాహనమనీ, ఇంటిముందు గుర్రబ్బండి కట్టడంవల్ల, 'బండి అద్దెకు దొరుకుతుందా' అని అందరూ అడుగుతున్నారని భార్యాబిడ్డలు పోరారు.

నిజమే అనంతాచార్యులు వకీలు అన్నది మరిచి పోయి, జట్కా ఓనర్ అనుకునే పరిస్థితి వచ్చింది.

ఆ ఉదయం బయటికి వచ్చి చూశాడు. కారు ఇంటిదగ్గరేఉంది. గుర్రాన్ని చూశాడు. గుర్రంకళ్ళల్లో నీళ్ళు కనిపించినట్లు భ్రాంతి చెందాడు.

శ్రీ కృష్ణదేవరాయల గుర్రం, రాణాప్రతాపుని గుర్రంలా కనిపించింది. దాని విశ్వాసం అపూర్వం.

గుర్రంమీద ఈ సెంటిమెంట్ ఏమిటో అర్థం కాలేదు. అలా నిలబడ్డాడు.

పాతికేళ్ళ యువకుడు వచ్చాడు.

"నమస్కారం సార్" అన్నాడు.

"నమస్తే. ఏం కావాలి బాబూ"

"గుర్రం"

"గుర్రమా"

"తమరు జట్కాబండి అమ్ముతారట. వకీలు రంగన్న గారు పంపారు."

"ఆయనకా."

"కాదు. నాకే. గుర్రబ్బండి తోలుతాము. మేము కొనాలనుకున్నాము సార్."

"నీ పేరు."

"గుర్రమన్న."

"అదేమిటయ్యా గుర్రన్న అన్న పేరు విన్నాను. గుర్రమన్న ఏమిటి."

"మా నాయనకూ, తాతగారికీ గుర్రమంటే విపరీతమైన భక్తి. దాన్నుంచే ఇన్నాళ్ళూ బతికారు. అదే అన్నం పెట్టిందని వారి నమ్మకం. అందుకే గుర్రమన్న పేరు పెట్టారు."

గుర్రం సెంటిమెంటు అది. అనంతాచార్యుల మనసు ద్రవించింది.

రేటు తగ్గించాడు.

భార్య లోపలికి పిలిచింది అనంతాచార్యులను.

"వెంటనే అమ్మేయండి" అంది.

ఆచార్యులు నొచ్చుకున్నాడు.



గుర్రమన్న ఇచ్చిన డబ్బు తీసుకుని బండి అమ్మేశాడు.

గుర్రాన్ని బండికి కట్టాడు గుర్రమన్న.

అది కదల్లేదు.

"సార్" అంటూ ఆచార్యులవైపు చూశాడు.

"చెప్పటం మరిచాను. ఇలారా" అన్నాడు.

"నేను బండిలో కూర్చున్నాక 'ఓం' అని మూడుసార్లు అనేవాడిని. అది నా అలవాటు. కొంత కాలానికి గుర్రానికి ఆ శబ్దం అలవాటయింది. బండితోలే ముందు 'ఓం' అంటూ కొన్ని సార్లు అరవాలి. అప్పుడే కదుల్తుంది."

గుర్రమన్నకు అనుమానం వేసింది.

ఇదేదో భజన గుర్రం. దీనివల్ల కష్టాలొస్తాయేమొ అద్దెకు తోలటానికి ఇబ్బంది అవుతుందా? తన బతుకు తెరువుకు సంబంధించిన సంగతిది.

బండిలో కూచుని 'ఓం' అంటూ పదిసార్లు అరిచాడు గుర్రం కదల్లేదు.

ఆచార్యులు ఇలా అన్నాడు.

"నేను బండిలో కూచొని అరిచేవాడిని. నువ్వు గుర్రం చెవిదగ్గర అరవాలి, అలవాటయ్యేదాకా." గుర్ర మన్న బండిదిగి గుర్రం చెవిలో "ఓం" అని ఆరు సార్లు అరిచాడు. అది కదిలింది.

ఎగిరి గంతేసి కూచున్నాడు గుర్రమన్న. ఇదేదో కొని తెచ్చుకున్న ఇబ్బందిలా కనిపించింది. బండి చాలా అవ సరం. ఉన్న ఒక్క బండితో తన తండ్రీ, తాను అద్దె సరిగ్గా సంపాయించలేకపోతున్నారు. తనకు పెళ్ళయింది. అవసరమయింది మరో బండి.

ఆ రోజు స్టేషన్ కెళ్ళాడు.

అప్పుడే పెళ్ళి సంబంధానికని ఇద్దరు దంపతులూ, కొడుకూ దిగారు.

గుర్రమన్న జట్కాలో కూచున్నాడు.

ఎంత కొట్టినా బయల్దేరలేదు. వెంటనే గుర్రమన్న బండి మీదినుంచి గెంతాడు. గుర్రం చెవిలో ఆరుసార్లు "ఓం" అంటూ అరిచాడు. గుర్రం కదిలింది. చెంగున ఎగిరి కూచున్నాడు. బండి సర్రుమని వేగంగా పరుగెత్తింది.

ఇది బండిలో కూచున్నవాళ్ళు గమనించలేదు.

బండికి ముందు బస్సొచ్చింది.

బండిని ఆపాడు గుర్రమన్న.

కొరడాతో చెళ్ళుమనిపించాడు.

గుర్రం కదల్లేదు.

మళ్ళీ కిందకు గెంతి దాని చెవిలో "ఓం" అంటూ అరిచాడు.

అప్పుడు కదిలింది.

బండిలో వాళ్ళకు అనుమానం వేసింది.

పిచ్చివాడి బండిలో ఎక్కామా అనిపించింది.

ట్రాఫిక్ పోలీస్ బండి ఆపాడు.

మళ్ళీ కదలటానికి గుర్రమన్న కిందకు దిగాడు.

గుర్రం చెవిలో "ఓం" అంటూ అరవసాగాడు. ట్రాఫిక్ పోలీస్, రోడ్డుమీద నున్న వాళ్ళు వింతగా చూశారు. బండ్లో కూచున్న వాళ్ళను కూడా వింతగా చూశారు జనం. వాళ్ళకు తల కొట్టేసినంత పనైంది.

బండి కదిలింది.

వాళ్ళు దిగాల్సిన అడ్రసు దగ్గరకు వచ్చేశారు.

ఇంతలో దూరాన ఓ గుడిలో రికార్డు పెట్టారు. పాట "ఓం" అన్న శబ్దం మూడుసార్లతో ప్రారంభం అయింది.

పాటవినగానే శరవేగంతో గుర్రం పరుగెత్తింది. బండిలో కూచున్నవాళ్ళు అతలాకుతలం అయ్యారు.

"బాబూ ఎలాగయినా బండి ఆపు" అరవసాగారు.

"గుడి చేరేవరకు సాధ్యం కాదు బాబూ" అంటున్నాడు గుర్రమన్న.

గుర్రం వెళ్తున్న వేగానికి తట్టుకోలేకపోతున్నారు. బండ్లో ఆచార్యులు లేకపోవటం, కొత్తవాడుంటం కూడా కారణ మేమో అనుకున్నాడు గుర్రమన్న.

ఇంతలో ఓ పోలీసు జీపు వచ్చింది.

ఆ రోజే ట్రాఫిక్ కంట్రోలు పరిశీలించటానికి డియస్పిగారు తిరుగుతున్నారు.

రోడ్డుమీద జట్కాబండి ఎవ్వరినీ లెక్కచెయ్యకుండా పోతోంది.

జీప్ వెంబడించింది.

రోడ్డుమీద జనం పక్కకు పరుగెత్త సాగారు. గుర్ర మన్న శతవిధాలా ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో ఎగిరి పక్కకు పడ్డాడు.

గుర్రం బండిలోని వాళ్ళు ఏడ్పులూ, పెడ బొబ్బలూ ప్రారంభించారు.

పోలీసులు చుట్టుముట్టసాగారు.

దేవాలయం నుంచి కారు పూజ ముగించుకుని కారులోవస్తున్న అనంతాచార్యులు కారు దిగాడు ఆ బండిని చూసి "ఓం" అని అరిచాడు.

గుర్రం ఆగింది.

"రక్షించావు బాబూ" అంటూ బండిలోని వాళ్ళు దిగారు. అందులోని వృద్ధుడు ఆచార్యులను కౌగిలించు కుని బావురుమని ఏడ్చాడు. ఆచార్యులు ఓదార్చాడు.

గుర్రమన్న ఆసుపత్రిలో చేరాడు.

ఆచార్యులను వెతుక్కుంటూ వచ్చాడు గుర్రమన్న బంధువులు.

"బాబూ గుర్రమన్నను రక్షించండి" అంటున్నారు.

"ఎందుకయ్యా"

"అయ్యా, వాడిని పోలీసులు అరెస్టు చేశారు."

"ఎందుకూ"

"ట్రాఫిక్ రూల్సంట బాబూ"

కేసు విషయం చూడటానికి ఆచార్యులు పోలీసు స్టేషన్‌కు వెళ్ళాడు.

గుర్రమన్న మీది కేసు ఉపసంహరించు కునేలా చేశారు.

ఇంటికి వెళ్ళాడు కోర్టు పని ముగిశాక. ఇంటిముందు బండి కనిపించింది.

గుర్రం ఆయన్ని ఆప్యాయంగా చూసింది.

అప్రయత్నంగా ఆయన "ఓం" అన్నాడు.

గుర్రం ఆనందంతో సకిలించింది.

టి. రాఘవేంద్రరావు
43/195 - C, ఎన్.ఆర్. పేట,
కర్నూలు.




కె.రాధ, వైఫాఫ్ఃశ్రీనివాస్, పోస్ట్ఃమల్లారం, మంఃతాడిచెర్ల -505 184, జిల్లాః కరీంనగర్.